# సంకటి కత

ఊరికే ఉంటే ఊరా పేరా అంటారు.

పేరు ఎట్టన్నా దొరిపోనీ. వాడెటువంటి మొగోడైనా సరే! ఇంట్లో చేతులు ముడ్సుకోని కూసుంటే ఆడదానిగ్గూడా అలుసై పోతాడు. చీటికిమాటికి దేన్నో ఒకదాన్ని సాటవబెట్టి సాపించనన్నా సాపిస్తారు. లేకుండాబోతే కొజ్జా మొగుడు కోట్లో ఉణ్ణా వాగిటే! పేట్లో ఉణ్ణా వాగిటేనని ఎత్తి పొడస్తారు.

అందుకే మొగోడుగా పుట్నోడు ఏందో ఒకపని చెయ్యాల. ఏందో ఒక పనంటే? ఏ పని చెయ్యాల? పేరొచ్చే పనే చెయ్యాల! మంచి పనులు చేసినా పేరొస్తింది. చెడ్డ పనులు చేసినా పేరొస్తింది. అయితే బతికినంత కాలం మంచి పని చేసినా రాని పేరు చెడ్డపని చేస్తే ఒక్క సెణంలో వచ్చేస్తింది. అట్టని చెడ్డ పనులు చేసే దాని కుండాదా? కాబట్టి మంచి పన్లంటే? –

ఆ పనితో ఒకరికింత మంచి జరగాల.

మల్లా ఈడొక చిన్న లిటిగేషన్. మనం చేస్తావుండే పనిలో ఆడెవుడికో మంచి జరిగితే మనకు వొరిగే దేముండాది. మనం చేసే పనితో మనకు మంచి జరగాల. తన్ను మాల్నె దర్మం మొదులుచెడ్డ బేరం గదా? అని కొంపలో కత మల్లా మొదుటికొస్తింది.

ఈ ఆడోళ్లుండారే ఊరికే ఉంటే ఉండనీరు.

అట్టని ఏదో వొగిటి చేస్తే వొప్పుకోరు.

ఇంక మన పెద్దోళ్లుండారే? వాళ్లు పోతా పోతా ఊరికే పోరు. ఊరికే పోతే ఊరా పేరా అని దెయ్యం పోతా పోతా ఒక కొమ్మయించేసి పొయ్‌నట్టు ఏదో వొగిటి అనేసి పోతారు. అది పెద్దోళ్లమాట గదా? సద్ది కూడు మూటగా చంకకు తగులుకుంటింది. ఇంక పిల్లిని చంకలో పెట్టుకుణ్ణె యవ్వారమే!

ఇంతకూ ఆ పొద్దు ఊరికే ఉంటే ఊరా పేరా? అని–

''నూకల సంకటికి కోడి కూరకు బలే మజాగా ఉంటిందే. పిడ్స పిడ్స నువ్వు వస్తావుంటే నేను పోతావుండా నంటింది. అన్ని నూకలుపోసి సంకటి కెలుకే!'' అంటి.

''సంకటి కెలికేదంటే ఎంత సంగటం? నా వల్లగాదు పో!'' అనె.

''చీటికీ మాటికీ సంకటి కెలికినట్టు నన్ను కెలకమంటే కెలకతావో?''

''నువ్వు ఆడే ఆట్లకు పడే పాట్లకు నేనుగానా నిన్ను సంకటి కెలికినట్టు కెలికేటిగావుంటే ఈ పొద్దు నువ్వు నన్ను సంకటి కెలకమని అడగబొయ్యేదిలే. నేను చెయ్యలేనని చెప్పబొయ్యేదిలే.''

అసలు సంకటంటేనే శానా మందికి తెల్దు. ఇంక సంగటి కెలికిన ట్టంటే ఎట్టా తెలిస్తిందిలే?

మల్లా ఈ సంకటి కూడా శానా రకాలుగా ఉంటింది. సద్ద సంకటి. జొన్న సంకటి. నూకల సంకటి. వొట్టి పిండి సంకటి. అని ముఖ్యెంగా నాలుగు రకాలు. చేసే వైనం తెలిస్తే ఎన్ని రకాలుంటే మాత్రం ఏముండాది? ఏ రకం సంకటైనా సరే మాయమ్మ వొంటి చేత్తో కెలికిపారేస్తా ఉండె. అయితే గూడా ఏమాట కామాట వొప్పు కోవాల్సిందే. మాబాశాలి అన్నెట్టు సంకటి కెలికేదంటే మాట్లుగాదు.

సద్దసంకటి కావాలంటే సద్దలు నానబోసి దంచి పిండి కొట్టుకోవాల. అదే జొన్న సంకటికైతే జొన్నలు పొట్టాడగొట్టి పిండికొట్టు కోవాల. నూకల సంకటికైతే నూకల్ను బాగానేమి ఏరిపించి సుద్ది చేసుకోవాల.

ఏ సంకటైనా రాగిపిండి కావాల్సిందే. సంకటి చట్లో ఎసురు పెట్టాల్సిందే!

ఎసురు కాగినాక సద్ద పిండో జొన్న పిండో నూకలో ఏ సంకటి కావాలంటే ఆ పిండి కాగిన ఎసుట్లో పోస్తా అబకతో కలబెట్టాల. లేకుండాబోతే పిండి ఉంటలు గట్టి పోతింది. ఇట్టా మాదిరి పిండి పోస్తా పోస్తా కలబెట్టినాక బాగా కళపళ ఉడక నియ్యాల. అప్పుడు రాగిపిండి పొయ్యాల. పోసిన రాగిపిండి లోపలికిపోదు. పైన్నే కుప్ప మాదిర అయితింది. ఆకుప్ప అడుగుబాగం సంకటిచట్టి మూతి ఎంతయడం ఉంటిందో అంత ఉంటింది. కాబట్టి చట్లో ఆవిర్ని పైకి రానీదు. ఆ ఆవిరితోనే పిండి కుత కుత ఉడికితింది. అట్టా మాదిరి బాగా ఉడికినాక చట్టికి యిరకల కట్టేసి ఒకకాల్తో కదలకుండా తొక్కిపట్టుకోని సంకటి కట్టెతో

కెలకాల. రాగిపిండితో కల్సేకుందికి అది మైణం మాదిర్తో అవితింది. అప్పుడు సంకటి పలకమింద పోసుకోని సిబ్బిరేకుతో ముద్దలు చేసుకోవాల!

ఒకొక ముద్ద పెద్ద తాటికాయికి ఒక చుట్టు పెద్దదిగానే ఉంటింది.

సంకటి చట్లో కట్టేసి రెక్కలిరిగి పొయ్యేటట్టుగా కెలికితే గానీ సంకటి మైణం మాదిర్తో కాదు. అందుకే మణిసి ఊరికే సతపోర్తా ఉంటే ఎందుకట్టా మణిసిని సంకటి కెలికినట్టు కెలకతావే అంటారు.

అంతకింతకు నన్ను సంకటి కెలికినట్టు కెలికే మా బాశాలి నోరు తెర్సి అడిగితే అంత సంకటి కెలిగి పెట్టలేక పొయ్యిందే? అని అనుకుండే కుందికి నా వొళ్లు అట్నే రగిలె. రగిల్తే ఏం చెయ్యాల? రాసి రంపాన పెట్టేదాని కవితిందా? అట్టగాని చేస్తేనా? –

''ఓయమ్మా? వాడేం మొగోడు? వాడేం మొగుడు? ఆడదాన్ని రీతిగా పెట్టుకోని సంసారం చెయ్‌లేనోడు. చెయ్‌లేనోడు చెయ్‌లేనట్టే ఉండిపోవాల. బొట్నేలు తొక్కి బొట్టెందుకు కట్టాల? ఇట్టెందుకు హిమస బెట్టాల.''

– అని నలుగురు నాలుగిదాలుగా నోరు పారేసుకుంటారు. నలగురి నోళ్లల్లో పడేదంటే అగుడు పడేదన్నమాట. అగుడుపణ్ణె సంసారం అగుడుపణ్ణె గొడ్డు రతి కెక్కనట్టే అగుడుపడ్తే మణిసిగూడా రతి కెక్కడంటారు. రతి కెక్కక పోతే పీడే యిరగడై పాయ. కొంపలో రంపు లేకుండాపోతే చాలనుకోని ఎలబార్నా!

నడస్తా వుంటే నా మణుసంతా సంకటి చుట్టే చుట్టకలాడ్తా వుండాది.

అదే మాయమ్మను అడిగుంటే? ఎట్టన్నా కన్న పేగ్గదా? అదట్టాపోనీ, పదైదు మంది కూలోళ్లకు ముప్పయి ముద్దల సంకటంటే? లెక్కేసుకోండేమే? ఎంత పెద్ద బాన పెట్టాల? ఎంత ఎసురు పొయ్యాల? ఎంత పిండి పొయ్యాల? ఇది గాకుండా యింట్లో వాళ్లకు నూకల సంకటి. మద్దేణాలకు కెలికి ఎత్తుకోని పొయ్ కూలోళ్లకేసి మల్లా వాళ్లతోగూడా సరిసమానంగా మునం బట్టి పనిచేసే మాయమ్మకు ముద్ద సంకటి కెలికేది వొక లెక్కా పక్కా?

పోనీ! అప్పుడేమన్నా అట్టపోసి యిట్ట తీసుకుండే దానికి మిసన్లు గిసన్లు యాడుండె? వడ్లు దంచు కోవాల్సిందే. సద్దలో జొన్నలో పిండి కొట్టుకోవాల్సిందే! రాగులు యిసురు కోవాల్సిందే?

ఇప్పుడా? పొయ్యి ముందర కూసోని ఫుర్ ఫుర్ మని ఊదే పనేలేదంటే యింక రోలు రోకలి కత ఎందుకులే? ఎమ్మే చదివిన బిడ్డ రాగ(ర)లాయి ఎట్టుంటింది నాయినా? అని నన్నే అడిగిందంటే యింక రొండు దినాలు పోతే రోలు రోకలి రాగ(ర)లాయి సంకటి పలక యిరకల కట్టి యిట్టాంటి వన్నీ ఎత్తుకోని పొయ్ మ్యూజింలో పెట్టి చూపించాల్సిందే!

నా చిన్నప్పుడు మాయమ్మ కూలోళ్లకు సంకటెత్తుకోని పోతావుంటే తోక మాదిర కొంగు పట్టుకోని నేను కూడా పొయ్యేటోణ్ణి!

మాయమ్మ చెట్టుకింద సంకటి తట్టట్లా దించేకుందికి కూలోళ్లందురు యాడ పని అణ్ణే అట్నే యిడ్సిపెట్టేసి దోనెలోనో దొరువులోనో కాలవలోనో కడాన ఆడ పెట్టుండే కడవలోనో చేతులు కడుక్కుంటారు. గబ గబ వచ్చి చెట్టుకింద సోలుపుగా కూసుంటారు. మాయమ్మ తలావొక ముద్ద సంకటెత్తి చేతికిస్తుంది. ఆ ముద్దను ఎడమ చేతి అర్సేతిలో పెట్టుకుంటారు. కుడి చేత్తో ఆ ముద్దను గుంత చేస్తారు. మాయమ్మ ఆ గుంతల్లో అంత పులుసో పులగూరో పోస్తింది.

ఇంక చూస్కో నాసామి రంగా!

ముద్దలో సంకటంత తుంచుకుండేది. పిడ్స చేసేది. తగిలీ తగలకుండా పురగూరంత అద్దుకుండేది. గుటిక్ గుటిక్ మని మింగేది.

వాళ్లట్టా మింగతా వుంటే ఎంత తమాసగా ఉంటిందని! నేనైతే గుడ్లు మిటకరించుకోని చూస్తా ఉండేది. పిడ్స మింద పిడ్స గుటిక్ గుటిక్ మని మింగతా వుంటే ఎట్ట మింగతారబ్బా అని ఆచ్చెర్రెం కలిగేది. ఎందుకంటే మాయమ్మకు నేను ఉడబోతు కాయిని గదా? అందువల్ల ముదిగారం జాస్తి. ఆ ముదిగారంతో నాకెప్పుడూ సంకటి పెట్లా. నాకని తనీగా రోన్ని బియ్యం యేసి వార్సి పెట్టేది.

తల్సుకుంటా ఉంటే యిప్పటిగ్గూడా నవ్వే నాకు! ఒకసారి తిరపతి నుంచి లీవుల్లో మిద్దూరికి పోతా వుండా? చిల్లర దుడ్లు తక్కవగా ఉండె. గాదింకిలోనే బస్సు దిగేసినా. గాదింకి నుంచి మిద్దూరికి ఆరేడు మైళ్లు ఉంటింది. నాలుగైదు మైళ్లదాకా మాంత మయిన అడివి. ఆ అడివిలోనే పోవాల. పొగులైతే పరవాలే. కస్జీగిటి పడ్తా పడ్తా ఉండాది. ఆ యాళకాడ అడివి దోవన ఆరేడు మైళ్లు నడ్సేదానికి అయితిందా? బుడంకాయంత గదా ఉండా. ఏ నక్కో గిక్కో నోట్లో యేసుకుణ్ణా అడిగే వాళ్లెవురు? అందుకని తెల్లర్తో ఎలబారి పోవచ్చులే అని గాదింకిలోనే నిలబడి పొయ్‌నా. ఇంక ఆ ఊళ్లో దిక్కెవురు? అట్టా యిట్టా చూసినా. దిక్కు లేనోళ్లకు దేముడే దిక్కు. ఆ దేముడు ఆ ఊళ్లో ఒక గుళ్లో ఉండాడు. ఆ గుళ్లోకి పొయ్ కూసుణ్ణా!

కొంచిం ఎమ్బా తక్కవగా కూటేళ అయ్యుంటిందేమో? ఆ యాళ కాడ కొందురు గుళ్లో కొచ్చి బజిన మొదులు పెట్రి. అప్పుడు ఏ సిల్మా కొటాయిలో చూడు బక్త పోతన సిల్మా ఆడ్తా ఉండాది. ఎవుడి నోట్లో యిందామన్నా సర్వ మంగళ నామా సీతా రామా రామా! పాటే. ఊరికే ఉంటే ఊరా పేరా అని ఆ పాట జమాయించి పాడేసినా. ఇంక చూస్కో నా సామీ! –

''ఏ ఊర్రా అబ్బోడా? ఎక్కిడికి పోతా వుండావురా? తిన్నావా లేదా?'' – అంటా తలకొక యిదంగా అడిగిరి. ఎమ్బులకు పోతే ఎండతామని తిన్లేదని చెప్తి!

''అయ్యయ్యో! యింకా తిన్లేదా? పదబ్బారే పద!''

– అని బలింతంగా వొక యింటికాడికి పిల్సుకోని పొయ్‌రి. కాళ్లూ చేతులూ

కడుక్కుండే దానికి నీళ్లిచ్చిరి. కడుక్కోని వచ్చేకుందికి పీటేసిరి. ఆ పీట ముందర పెద్ద యిస్త్రాకు పర్సిరి. ఆ యిస్త్రాకు మింద నీళ్లు చల్లిరి. నేను పీట మింద కూసుండే కుందికి ముద్ద సంకటి తెచ్చి ఆకులో పెట్రి!

ఆ ముద్దను చూసేకుందికి నా ఆకిలి ఎట్ల పాయనో ఎగిరి పాయ!

రోట్లో తలకాయి దూర్సిన యవారమై పాయ కత. తినలేను. తినలేనని చెప్పలేను. అట్నే ముద్ద కల్లా చూస్తా కూసుంటే కండ్లల్లో నీళ్లకమ్మి రొంచేపిటికి పలపలరాలె.

పాపం! ఆయింటి యిల్లాలు ఏమనుకుణ్ణిందో? –

''ఒరే అబ్బోడా! ఎందుకురా యాడస్తా ఉండావు! ఎవురు గ్యాపకాని కొచ్చినార్రా. అలిగ్గిలిగి వచ్చేస్తివా? పోనీలే. మా యింటాయిన ఉండాడు గదా. తోడంపిస్తాలే. ఇంటికి పోదువులే. తిను నాయినా తిను.'' అంటా ఉండాది.

ఆమె మాత్రం ఎట్లా అనుకుంటింది రాయల సీమలో పుట్నె ఒక పిలగాడు సంకటి తినలేకుండా యాడస్తా ఉండాడని! అదే దొరక్కుండా యాడస్తా ఉంటే?

ఇబ్బందిగా మొకం పెట్టేకుందికి ఆ మహాతల్లి యింతింత కండ్లు చేసి చూసింది. అప్పుడు అర్తం అయినట్టుండాది. గురుగుపువ్వు మాదిర్తో ఉండే పిలగాడు. గుటిక్ గుటిక్ మని సంకటి మింగలేడని. సరే! ఆ ముద్ద సంకటి ఎత్తేసె. ఇక్కింటికో పక్కింటికో పాయ్ పిడికిడు మెతుకులు తెచ్చిపెట్టె.

ఆ కూడు తింటావుంటే చెట్టుకింద కూసోని గుటిక్ గుటిక్ మని సంకటి ముద్దలు మింగతావుండే కూలోళ్లు అట్నే నాకండ్ల ముందర మెదల్తా ఉండారు.

ఇంటి కొచ్చినాక మా రామన్నతో ఆమాటంటే–

''అందుకేరా అబ్బోడా అన్నిట్లో పడిలెయ్యాల. పడిలేస్తే గానీ దానిలోతు తెల్దు. కాళ్లకు చెప్పులుండాయని ఏసుకోని తిరగతా ఉండావు గదా? అవ్వి లేవనుకోని వట్టి కాళ్లతో నడవాల. తినే దానికి కూడు ఉండాదని తింటా ఉండావు. తిండిలేని రోజు కూడా రావచ్చు. అందుకని పస్తుపడి ఉండాల. అప్పుడు ఆకిలంటే అర్తం తెలిస్తింది. అదే మాదిర ఎప్పుడు కూడు కూడని కలవరించ కుండా సంకటి గూడా తినాల. వాడిక అయితిందనుకో. మొన్న యిబ్బంది పణ్ణెట్టు పడవుగదా?'' అంటా పాటం చెప్పె.

ఆ పాటం తలకెక్కే కుందికి అప్పుడు మాయమ్మ నడిగి నూకల సంకటి పెట్టించుకోని తింటి. తొలీత మింగేది కొంచెం యాసకాటంగా ఉణ్ణా మల్లా మల్లా నూకల సంకటి కోడి కూరంటే ముందు ముందుగా నేనే కంచం ఎత్తుకుంటా ఉంటి.

అదే చెట్టుకింద కూలోళ్లు అయితే కన్ను మూసి తెర్సే లోపల ముద్ద సంకటి లగాయించేసి రొండు అర్సేతులు జోడించి దోసిట్నె నోటికాడ పెట్టుకుంటే మాయమ్మ వర్సగా కూటి నీళ్లు పోసేది. ఆ నీళ్ల తాగేస్తానే మల్లా ముద్ద సంకటి. కొందురు తినేస్తారు కొందురు ఎత్తుకోని యింటి కాడికి పరిగెత్తారు. ఎందుకమ్మా? అని అడిగితే–

''ఇంటికాడ లేదర బిడ్డ లుంటారు గదా? వాళ్లకంత పెట్టాల గదా?'' అనేది.

రొండు ముద్దలు సంకటి తినేసి కొందురు పని చేస్తే ముద్ద సంకటి తోనే కొందురు మునం పడ్తా ఉండారు. అయ్యో పాపం! అనిపించేది. అనిపిస్తే యినిపించు కుండే దెవురు?

''రొండు ముద్దలు సంకటి ఎట్ల తింటారమ్మా?'' అని అడిగితే-

''ఇదేందిరా? వాడు అడివోళ్ల కర్రెన్న అయితే అయిదు ముద్దలు అలాగ్గా. లగాయించేస్తాడు. ఏలుకూరోళ్ల ఎర్రోడికైతే ఏడు ముద్దలు యాడికీ చాలవు.'' అంటా న్వేది.

వాళ్లందురు అట్టా మాదిర తిన్నారు. అట్టా మాదిర్నే కష్టపణ్ణారు. ఇప్పుడా? అదీలే. ఇదీలే. అనుకుంటా ఆడ తిరిగి యీడ తిరిగి రగిల్నెవొళ్ల చల్లబణ్ణాక తిరుక్కోని వస్తా ఉండా. నాలుగ్గాళ్లమండపం కాడ ముత్తా రెడ్డన్న ఎదురుపడె!

''ఏమిరా సమాచారం?'' అంటే-

''అన్నా మాబాశాలి అన్ని నూకలు పోసి సంకటి కెలకమంటే కెలకక పాయ గదన్నా. అదే యిశారం.'' అంటి.

''నువ్వు పద్దెం రాయగల్తావా?''

''కష్టమే!''

''అట్నే మీ బాశాలికి సంకటి కెలికేది కష్టం. ఎట్లంటావా? పద్దెం రాయాలంటే యతి గణ ప్రాసలు తెల్సుకోవాల్సినట్టు గానే సంకటి కెలకాలంటే ఎంత ఎసురు పెట్టాల? ఆ ఎసురుకు తగినట్టుగా ఎంత పిండి పొయ్యాల? ఈ రెంటికి తగినట్టుగా ఎంత రాగి పిండి కావాల. అని తెల్సి ఉండాల. నువ్వు పద్దెం రాయలేవు. మీ బాశాలి సంకటి కెలకలేందు. ముందు నువ్వు యింటికి పోరా!'' అనె.

అందుకేనేమో ఈ సీమలో అందురు పద్దేలు రాసే కవులే పుట్నారనుకుంటి. ●